

రెడ్'క్రాస్'అవుతున్న సేవా సంస్థ

ప్రాణాపాయ స్థితిలో రక్తం అందించి ఆదుకునే బాధ్యతగల రెడ్‌క్రాస్ సంస్థ పలు విమర్శలకు లోనవుతోంది. - 8లో



ప్రాణం తీసిన ఈత సరదా

సరదాగా ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు ఇద్దరు గల్లంతయ్యారు. ఒకరి మృతదేహం లభ్యమైంది. - 8లో



అంగరంగ వైభవం.. వెల్లాల రథోత్సవం

రాజుపాళెం మండలం వెల్లాల బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. - 8లో

పదో తరగతి పరీక్షా ఫలితాల్లో రాష్ట్రంలో అత్యధిక మార్కులు సాధించిన వారి జాబితాలో ప్రొద్దుటూరుకు చెందిన ఇద్దరు విద్యార్థులు 590 మార్కులతో స్థానం దక్కించుకున్నారు. వారి మనోగతం ఇలా..

తల్లిదండ్రుల కష్టాన్ని కళ్లారా చూసి..



తల్లిదండ్రులతో సోమల వెంకటరామ శరణ్య

నాపేరు సోమల వెంకట రామశరణ్య. మాది ప్రొద్దుటూరు. మా తండ్రి సోమల వెంకటరమణారెడ్డి హమాలీ పనిచేస్తాడు, మా తల్లి వెంకటలక్ష్మమ్మ టైలర్ పని చేస్తుంది. వాళ్లిద్దరు నా కోసం, మా తమ్ముడి కోసం అలుపెరగకుండా కష్టపడుతున్నారు. వారి కష్టాన్ని నేను కళ్లారా చూస్తున్నా. నేను ఎలాగైనా కష్టపడి చదివి జీవితంలో మంచి ఉద్యోగాన్ని సాధించి మా తల్లిదండ్రులను బాగా చూసుకోవాలనే లక్ష్యంతో కష్టపడి చదువుతున్నా. 6వ తరగతి నుంచి ఎద్దుల వెంకటసుబ్బమ్మ మున్సిపల్ హైస్కూల్లో చదువుతున్నాను. మా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కాశీప్రసాద్‌రెడ్డి నన్ను బాగా ప్రోత్సహించారు.

సివిల్స్ చదవడమే లక్ష్యం



తల్లిదండ్రులతో శీల హరిణి

నాపేరు శీల హరిణి. మాది ప్రొద్దుటూరు పట్టణం. మా తండ్రి అశోక్‌కుమార్ ఏపీఎస్ఆర్టీసీలో మెకానిక్‌గా పనిచేస్తున్నారు. తల్లి నాగ మహేశ్వరి టైలర్. నాకు ఒక చెల్లెలు, ఒక తమ్ముడు ఉన్నారు. పదో తరగతి రామేశ్వరంలోని మున్సిపల్ హైస్కూల్లో చదివాను. అక్కడ ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుడి సలహాలు, సూచనలతో కష్టపడి చదివాను. 600 మార్కులకు 590 మార్కులు సాధించాను. ట్రిపుల్ ఐటీలో చేరి ఆ తర్వాత సివిల్స్‌కు సిద్ధమవుతా.

సర్కారు బడి.. మెరుగుపడి..

- పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మెరిసిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు
- జిల్లాలో పలు ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో వందశాతం ఉత్తీర్ణత
- అగ్రస్థానంలో ఆరు జిల్లా పరిషత్ హైస్కూళ్లు, మూడు కేజీబీవీలు, కడప అంధుల పాఠశాల
- ఏపీఆర్ఎస్‌లో 98.73 శాతం, బీసీ వెల్ఫేర్‌లో 90.96 శాతం ఉత్తీర్ణత



కడప మున్సిపల్ ఉర్దూ స్కూల్లో 550 పైగా మార్కులు సాధించిన విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలలు అనగానే పెదవి విరుపు.. శిథిలావస్థకు చేరుకున్న భవనాలు.. చాలీచాలని తరగతి గదులు.. కనీస వసతులు కనుమరుగు.. బోధన సిబ్బంది కొరత.. దీంతో ఫలితాల్లో నానాటికి తీసికట్టు.. ఇది నాలుగేళ్లకు ముందుమాట. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేయడంతోపాటు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. నాడు– నేడుతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చేశారు. ప్రభుత్వ పాఠశాలకు అన్ని రకాల వసతులు సమకూరడంతోపాటు సిబ్బంది కొరత ఊసేలేదు. విద్యా ప్రమాణాల పెంపునకు పలు సంస్కరణలు అమలు చేస్తున్నారు. బోధన విషయంలో వినూత్న మార్పులు తీసుకువచ్చారు. ఫలితంగా నేడు ఫలితాల్లో సగర్వంగా ప్రభుత్వ పాఠశాలలు తలెత్తుకుంటున్నాయి. తాజాగా విడుదలైన పది ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కార్పొరేట్ పాఠశాలల విద్యార్థులకు తీసిపోకుండా తమ ప్రతిభను చాటి భళా అనిపించుకున్నారు. విద్యార్థులు ప్రభుత్వమిచ్చిన అవకాశాన్ని అంది పుచ్చుకుని ఫలితాల పరంగా సత్తా చాటుకున్నారు. సాదాసీదా జీవన పరిస్థితుల నేపథ్యం నుంచి వచ్చిన వీరంతా మార్కుల్లో మెరిసి పలువురి మన్ననలు పొందుతున్నారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలల వివరాలు...

జిల్లాలో పలు యాజమాన్య పాఠశాలలు వందశాతం ఉత్తీర్ణత శాతాన్ని సాధించాయి. మైలవరంలోని ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల, వేంపల్లి ఏపీఆర్ఎస్ స్కూల్, కడపలోని ఆంధ్రప్రదేశ్ ట్రైబల్ బాలికల పాఠశాల, కడప అంధుల పాఠశాల, కమలాపురం, తొండూరు బీసీ వెల్ఫేర్ స్కూల్, బలపనూరు, వీఎన్‌పల్లి, పాయసంపల్లె, ఉరుటూరు జిల్లా పరిషత్‌పాఠశాలలు, జమ్మలమడుగు, అమృతానగర్ ఉర్దూ పాఠశాలల విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించారు.

మూడు కేజీబీవీల్లో..

జిల్లా వ్యాప్తంగా 17 కేజీబీవీలు ఉండగా అందులో 591 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 461 మంది పాస్ అయి 78 శాతం మేర ఉత్తీర్ణతను సాధించారు. ఇందులో చక్రాయపేట, సింహాద్రిపురం, అట్లూరు కేజీబీవీలు వందశాతం ఉత్తీర్ణతను సాధించాయి. సింహాద్రిపురం కేజీబీవీ విద్యార్థిని చంద్ర మహేశ్వరి 564 మార్కులు, కలసపాడు కేజీబీవీకి చెందిన కరుణ 561 మార్కులు, మైదుకూరు, చక్రాయపేటలకు చెందిన కేజీబీవీ విద్యార్థులు జయలక్ష్మి 555, పవిత్రలు 555 మార్కులు సాధించారు.

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల సత్తా..

జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కార్పొరేట్‌కు దీటుగా మార్కులను సాధించారు. 600 మార్కులకుగాను 550కి పైగా మార్కులను సాధించి ఔరా అనిపించారు. బద్వేల్ జెడ్పీ హైస్కూల్‌కు చెందిన వెంకటశివ 578 మార్కులు సాధించాడు. ఈ విద్యార్థి తండ్రి వెంకటరమణ కార్పెంటర్ పనిచేస్తున్నాడు. అదే పాఠశాలకు చెందిన మరో విద్యార్థి మెర్సీరాణి 574 మార్కులు సాధించింది. తండ్రి దేవదాసు కండక్టర్ ఉద్యోగం చేస్తున్నారు. అలాగే మరో విద్యార్థి నవనీశ్వరరెడ్డి 566 మార్కులు సాధించాడు. తండ్రి మల్లేశ్వరరెడ్డి కాంట్రాక్టరు. అలాగే మరో 26 మంది విద్యార్థులు 500 పైగా మార్కులు సాధించారు.

ఉర్దూ మీడియంలోనూ..

జమ్మలమడుగు ఉర్దూ ఉన్నత పాఠశాలలో షఫియా 549 మార్కులు, మాబుచాన్ 545, రుక్సాన 536, మాబుచాన్ 535, ఫర్హానా 531, కరిష్మా, అజ్మత్‌లు 525, హస్సయ్ 510 మార్కులను సాధించారు. ప్రొద్దుటూరు మోడంపల్లె మున్సిపల్ ఉర్దూ హైస్కూల్‌కు చెందిన 89 మంది విద్యార్థులు పరీక్ష రాస్తే అందులో 67 మంది ఉత్తీర్ణత సాధించగా 46 మంది ప్రథమస్థానంలో నిలువగా మరో 15 మంది ద్వితీయస్థానంలో నిలిచారు. ఇందులో సమీరా 559 మార్కులను సాధించగా షహిదా 551 మార్కులను సాధించింది. అలాగే ఆఫియా 548 మార్కులను, ఫరీదా 544 మార్కులను, ఆస్సన 532 మార్కులను, సమీరా 521 మార్కులను సాధించారు.

జెడ్పీ హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ

వీరపునాయునిపల్లె మండలం ఉరుటూరు జెడ్పీ హైస్కూల్లో 57 మంది పరీక్ష రాయగా 57 మంది పాసై వందశాతం ఉత్తీర్ణత సాధించడంతోపాటు 13 మంది 500 మార్కులకు పైగా సాధించారు. ఇందులో వంశీకుమార్ 564 మార్కులు, చరణ్‌సేన 558, మల్లికార్జున 555 మార్కులను సాధించారు.అలాగే పాయసంపల్లె జెడ్పీ హైస్కూల్లో కూడా 33 మంది పరీక్ష రాయగా 33 మంది పాసై వందశాతం ఉత్తీర్ణతను సాధించారు. ఇందులో పవిత్ర 562 మార్కులను సాధించగా సంధ్య 559 మార్కులను, మయూర్‌రెడ్డి 557 మార్కులను సాధించారు. గంగిరెడ్డిపల్లె జెడ్పీ హైస్కూల్లో 30 మంది పరీక్షరాస్తే 28 మంది పాసై 93 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇందులో సూర్యతేజ 539 మార్కులను, రామ్‌చరణ్ 527 మార్కులను సాధించారు. పాలగిరి జెడ్పీ హైస్కూల్లో 16 మంది పరీక్షరాయగా 16 మంది పాస్ అయి వందశాతం ఉత్తీర్ణతను సాధించారు. సబియా 518 మార్కులను సాధించింది.

జెడ్పీ స్కూళ్లలో మండల టాపర్లు వీరే..

చక్రాయపేట నాగులగుట్టపల్లె జెడ్పీ హైస్కూల్‌కు చెందిన నాగేలి లావణ్య 585 మార్కులు, తొండూరు మండల జెడ్పీ హైస్కూల్‌కు చెందిన వైష్ణవి 575 మార్కులు, మైదుకూరు ప్రభుత్వ పాఠశాలకు చెందిన రామ హేమాంజలి 583 మార్కులు, లింగాల మండలం వెలిదండ్ల జెడ్పీ హైస్కూల్‌కు చెందిన నవ్య 575 మార్కులు, కాశినాయన మండలంల నరసాపురం జెడ్పీ హైస్కూల్ చెందిన కల్యాణ్ 551 మార్కులు, సీకేదిన్నె మండల జెడ్పీ హైస్కూల్‌కు చెందిన సుష్మ 553 మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానంలో నిలిచారు.

- రాజుపాళెం మండలం గాదెగూడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని మల్లీశ్వరి 540 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది. బాలిక తల్లిదండ్రులు సిద్ధి శివశంకర్‌రెడ్డి, శ్రీదేవి వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు.



తల్లిదండ్రులతో మల్లీశ్వరి

- చెన్నూరు ప్రభుత్వ బాలుర హైస్కూల్‌కు చెందిన అన్వర్ హుస్సేన్ 576 మార్కులు సాధించాడు.

▸▸ మున్సిపాలిటీల్లోనూ..

ప్రొద్దుటూరు వైవీఎస్ బాలికల హైస్కూల్‌కు చెందిన వెంకటరామశరణ్య 590 మార్కులు సాధించగా అదే పాఠశాలకు చెందిన నఫీజ్ 571 మార్కులు సాధించింది. అలాగే ప్రొద్దుటూరు రామేశ్వరం మున్సిపల్ హైస్కూల్‌కు చెందిన హరిణి 590 మార్కులు సాధించింది, వీరితోపాటు పలు మండలాలకు చెందిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పది ఫలితాల్లో తమ ప్రతిభను చాటారు.



వెంకటశివ/578 బద్వేల్ జిల్లా పరిషత్తు పాఠశాల



మెర్సీరాణి(574) బద్వేల్ జిల్లా పరిషత్తు పాఠశాల



నఫీజ్/571, ప్రొద్దుటూరు బాలికల హైస్కూల్



నవనీశ్వరరెడ్డి (566) బద్వేల్ జిల్లా పరిషత్తు పాఠశాల



చంద్రమహేశ్వరి (564) సింహాద్రిపురం కేజీబీవీ



కరుణ(561) కలసపాడు కేజీబీవీ




జయలక్ష్మి (555) మైదుకూరు కేజీబీవీ

మేనేజ్‌మెంట్ వారిగా ఉత్తీర్ణత శాతం ఇలా...

మేనేజ్‌మెంట్	పరీక్షలు రాసినవారు	పాస్	ఫెయిల్	ఉత్తీర్ణతశాతం
ఎయిడెడ్	763	497	266	65.14
బీసీ వెల్ఫేర్	188	171	17	90.96
ప్రభుత్వ	670	433	237	64.63
కేజీబీవీ	591	461	130	78.0
మున్సిపాలిటీ	1743	1068	675	61.27
మోడల్‌స్కూల్స్	263	193	73	72.24
ఏపీఆర్ఎస్	157	155	02	98.73
సోషల్ వెల్ఫేర్	833	649	184	77.91
ట్రైబల్ వెల్ఫేర్	102	77	25	75.49
జెడ్పీ	9498	6507	2951	68.80

న్యూస్‌రీల్

11న పుస్తక పరిచయ సభ



కడప కల్చరల్: బద్వేలుకు చెందిన కథా రచయిత యలిచెర్ల గజేంద్రనాథరెడ్డి రచించిన నా సీమ యాసే నా శ్వాస కథా సంపుటి పరిచయ సభను ఈనెల 11వ తేదీ సాయంత్రం 5.30 గంటలకు కడప సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో నిర్వహించనున్నారు. హైదరాబాదుకు చెందిన లలితకళాభిరామ పింఛం సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రముఖ శిల్పకారుడు, కళారత్న గొల్లపల్లి జయన్న, స్థానిక రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ సౌజన్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. బ్రౌన్ కేంద్రం సంచాలకులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి అధ్యక్షతన జరగనున్న ఈ కార్యక్రమానికి ఇంటాక్ కడప చాప్టర్ కన్వీనర్ లయన్ కె.మానస చిన్నపరెడ్డి ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. వ్యక్తిత్వ వికాస నిపుణులు, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ డాక్టర్ ఎలిచర్ల శివానంద లహరిరెడ్డి, వైవీయూ లలిత కళల విభాగం చిత్రలేఖన శాఖ అధ్యక్షులు డాక్టర్ కోట మృత్యుంజయరావు, నవలా రచయిత, సినీ నిర్మాత, దర్శకుడు వివేక్ లంకమల విశిష్ట అతిథులుగా రానున్నారు. రాష్ట్ర అధికార భాషా సంఘం సభ్యుడు డాక్టర్ తవ్వా వెంకటయ్య, మరాఠా రత్న జాతీయ అవార్డు గ్రహీత ఎంకేబీఎన్ఆర్ సాగర్ గౌరవ అతిథులుగా పాల్గొంటారు. ఈ సందర్భంగా పలు రంగాల్లో విశేష సేవలు అందిస్తున్న వారికి లలిత కళాభిరామ పింఛం అవార్డులను ప్రదానం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

10న ఊటీకి ప్రత్యేక బస్సు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప జోన్ పరిధిలోని మదనపల్లె-2 డిపో నుంచి కోయంబత్తూరు మీదుగా ఊటీకి ప్రత్యేక బస్సు నడుపుతున్నామని కడపజోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గోపినాథ్‌రెడ్డి తెలిపారు. తమిళనాడు రాష్ట్రంలోని ఊటీ (ఉదక మండలం)కి ఈనెల 10వ తేదీ రాత్రి 8.00 గంటలకు మదనపల్లె నుంచి ఈ బస్సు బయలుదేరుతుందన్నారు. మరుసటిరోజు ఉదయం 7.00 గంటలకు మెట్‌పాలెం చేరుకుని 8.00 గంటలకల్లా బస్సు ఊటీకి చేరుతుందన్నారు. సాయంత్రం 7.00 గంటలకు ఊటీ నుంచి బయలుదేరి మరుసటిరోజు ఉదయానికి మెట్‌పాలెం చేరుకుంటారన్నారు. బ్లాంక్ థండర్ (వండర్ లా) చూసుకుని 8.00 గంటలకు కోయంబత్తూరు ఈశా టెంపుల్‌ను దర్శించుకుంటారన్నారు. రాత్రికి లేజర్ షో చూసుకుని కోయంబత్తూరు నుంచి మరుసటిరోజు ఉదయం 8.00 గంటలకు మదనపల్లెకు చేరుకుంటుందన్నారు. ప్రయాణీకులకు రాను, పోను రూ. 2250 చార్జి ఉంటుందన్నారు. ఇతర వివరాలు, రిజర్వేషన్ల కోసం 99592 25677, 9160186645 నంబర్లలో సంప్రదించాలన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బీఈడీ కళాశాలల యాజమాన్య సంఘం కార్యవర్గం

- గౌరవాధ్యక్షునిగా ఎమ్మెల్సీ ఎం.వి. రామచంద్రారెడ్డి
- అధ్యక్ష, కార్యదర్శులుగా విజయ్‌కుమార్, వెంకటశ్రీను



బీఈడీ కళాశాలల సమస్యలపై చర్చిస్తున్న కార్యవర్గం

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలోని బీఈడీ కళాశాలల యాజమాన్య సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటైంది. ఆదివారం కడప నగరంలోని లేవాకు నారపురెడ్డి బీఈడీ కళాశాలలో కళాశాలల కరస్పాండెంట్లు హాజరై నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడుగా ఎమ్మెల్సీ ఎం.వి. రామచంద్రారెడ్డి, అధ్యక్షుడుగా ఎస్. విజయ్‌కుమార్, కార్యదర్శిగా జి. వెంకటశ్రీను, కోశాధికారిగా ఎస్. అలీ అక్బర్‌లను ఎన్నుకున్నారు. వీరితో పాటు ఉపాధ్యక్షులుగా ఒంటిగారి సుధీర్, వై.వి. జయప్రకాష్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా ఎం. అమర్‌నాథ్‌రెడ్డి, కె. చంద్రశేఖర్‌లను ఎన్నుకున్నారు. ఎన్నికైన నూతన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ బీఈడీ కళాశాలల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో బీఈడీ కళాశాలల కరస్పాండెంట్లు టింబర్ డిపో శ్రీనివాసులు, సుబ్బానాయుడు, చంద్రశేఖర్, నితీష్‌రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ఉగ్రంను ఆదరించినందుకు ధన్యవాదాలు

- సినీ నటుడు అల్లరి నరేష్
- కడప పెద్దదర్గాలో ప్రత్యేక ప్రార్థనలు



పెద్దదర్గాలో ప్రార్థనలు నిర్వహిస్తున్న సినీ నటుడు అల్లరి నరేష్, చిత్ర యూనిట్‌సభ్యులు

కడప కల్చరల్ : తాను ప్రధానపాత్రలో నటించిన ఉగ్రం చిత్రాన్ని ఆదరించినందుకు ప్రేక్షక దేవుళ్లందరికీ ధన్యవాదాలు తెలుపుతున్నానని ప్రముఖ సినీ నటుడు అల్లరి నరేష్ అన్నారు. ఆదివారం ఉగ్రం చిత్రం విజయయాత్రలో భాగంగా చిత్ర దర్శకుడు విజయ్, కథానాయిక మీరా మీనన్, ఇతర యూనిట్ సభ్యులతో కలిసి ఆయన కడపకు విచ్చేశారు. తొలుత స్థానిక అమీన్‌పీర్ పెద్దర్గాను దర్శించుకున్నారు. దర్గా ప్రతినిధి అమీర్ ఆయనకు స్వాగతం పలికి సంప్రదాయ దుస్తులను ధరింపజేశారు. ఈ సందర్భంగాగా నరేష్ చాదర్‌ను ఊరేగింపుగా తీసుకొచ్చి దర్గా గురువుల మజార్‌పై సమర్పించి ప్రార్థనలు నిర్వహించారు. ముజావర్ అమీర్ వారికి దర్గాలోని ఇతర గురువుల మజార్లను కూడా దర్శింపజేసి దర్గా గురువుల చరిత్ర, విశిష్టతలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దర్గాను దర్శించుకోవడం ఇది రెండవసారి అని, దర్గా గురువుల మహిమల గురించి ఎంతో విన్నానని, రెండవసారి తన చిత్రం విజయవంతమైన సందర్భంగా రావడం గొప్ప అనుభూతి ఇస్తోందని తెలిపారు. ఈ సినిమాను ప్రేక్షకులు ఆదరించడం సంతోషంగా ఉందని, అందరూ తప్పక ఈ సినిమాను చూడాలని కోరారు. ఈ ప్రోత్సాహంతో భవిష్యత్తులో ఇంకా మంచి చిత్రాల్లో నటించేందుకు ప్రయత్నిస్తానని, విజయయాత్రలో భాగంగా ఉగ్రం సినిమా ప్రదర్శిస్తున్న థియేటర్‌కు వెళ్లనున్నట్లు తెలిపారు. తనను చూసేందుకు వచ్చిన అభిమానులకు అభివాదం చేసి ఉత్సాహ పరిచారు.

థియేటర్‌లో నరేష్ 'అల్లరి'

అనంతరం కడపలో ఉగ్రం సినిమా ప్రదర్శిస్తున్న థియేటర్‌కు వెళ్లారు. థియేటర్ యాజమాన్యం, అభిమానులు హర్షధ్వానాలతో ఘనంగా స్వాగతం పలికారు. థియేటర్‌లోకి వెళ్లిన ఆయన సినిమాకు విజయం చేకూర్చినందుకు ప్రేక్షకులను ధన్యవాదాలు తెలిపారు. ఇలాంటి మరిన్ని చిత్రాలు చేస్తానని చెప్పారు. ఈ సందర్భంగా ప్రేక్షకులు ఆయనతో సెల్ఫీలు తీసుకునేందుకు, కరచాలనం చేసేందుకు పోటీలు పడ్డారు.

నిర్మాణాల జోరు.. ఇక జలహోరు

- టీడీపీ హయాంలో పూర్తయింది ఒక టన్నెల్ మాత్రమే
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక రెండవ టన్నెల్ పూర్తి
- మూడవ టన్నెల్ పనులు ప్రారంభం ..డిసెంబరులో పూర్తికి చర్యలు
- మూడవ టన్నెల్ పూర్తయితే రోజుకు గండికోటకు 30 వేల క్యూసెక్కుల నీరు



పనులు జరుగుతున్న మూడవ టన్నెల్ ప్రాంతం

కడప సిటీ: జిల్లాలో గండికోట ప్రాజెక్టు జల జీవనాడిగా నిలుస్తోంది. గాలేరు-నగరి సుజల స్రవంతి ద్వారా అవుకు రిజర్వాయర్ నుంచి వచ్చే నీళ్లకు ఇప్పటికే రెండు సొరంగ మార్గాలు (టన్నెల్) పూర్తి కాగా, మూడవ టన్నెల్ పనులు సగం మేర పూర్తయ్యాయి. ఈ టన్నెల్ నిర్మాణం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. టీడీపీ హయాంలో కేవలం ఒక టన్నెల్ మాత్రమే ఉండగా, ఈ ప్రభుత్వం వచ్చాక రెండవ టన్నెల్ నిర్మాణం పూర్తి చేయడంతోపాటు మూడవ టన్నెల్ నిర్మాణ పనులు కూడా ఊపందుకుని సగం మేర ఇప్పటికే పూర్తయి డిసెంబరు నాటికి టన్నెల్ రెడీ కానుంది. దీంతో గండికోట ప్రాజెక్టు అవుకు రిజర్వాయర్ నుంచి వరద నీరు రోజుకు ఒక్కొక్క టన్నెల్ నుంచి 10 వేల క్యూసెక్కుల చొప్పున నీళ్లు వచ్చే అవకాశం ఉన్నందున రోజుకు 30 వేల క్యూసెక్కులు గండికోట ప్రాజెక్టుకు చేరనున్నాయి. ఈ నేపథ్యంలో గండికోట ప్రాజెక్టు ఎప్పటికీ జలకళను సంతరించుకునే అవకాశం ఉంటుంది.

రూ. 1210 కోట్లతో టన్నెళ్లు ఏర్పాటు

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రాజెక్టుల నిర్మాణానికి ప్రత్యేక శ్రద్ధ వహించారు. అందులో భాగంగా టీడీపీ ప్రభుత్వ హయాంలో అవుకు రిజర్వాయర్ నుంచి నీళ్లు వచ్చేందుకు ఒక టన్నెల్ మాత్రమే ఉండేది. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక గండికోటలో ఎప్పటికీ నీళ్లు ఉండేలా పటిష్టమైన చర్యలు తీసుకున్నారు. అవుకు రిజర్వాయర్ నుంచి గండికోటకు నీళ్లు వచ్చేందుకు మరో రెండు టన్నెళ్లు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టారు. ఒక్కొక్క టన్నెల్ (సొరంగ మార్గం) ఆరు కిలోమీటర్లు మేర ఉంటుంది. అందులో భాగంగా ఒక్కొక్క టన్నెల్ నిర్మాణానికి రూ. 605 కోట్లు కాగా, రెండు టన్నెళ్లకు కలిపి రూ. 1210 కోట్ల నిధులు కేటాయించారు. ఇప్పటికే మూడో టన్నెల్ నిర్మాణ పనులు 50 శాతం పూర్తయ్యాయి. మిగిలిన పనులు డిసెంబరు నాటికి పూర్తి చేసేందుకు పనులు వేగవంతం చేస్తున్నారు. ఈ టన్నెల్ పూర్తయితే అవుకు నుంచి వచ్చే వరద నీరు గండికోటకు రోజుకు 30 వేల క్యూసెక్కుల నీళ్లు చేరనున్నాయి.

జల జీవనాడి గండికోట

జిల్లాలో గండికోట ప్రాజెక్టు ద్వారా ప్రజల్లో జీవనాధారం పెరిగేందుకు మరింత అవకాశం ఏర్పడింది. ఈ ప్రాజెక్టు ద్వారా పలు గ్రామాలకు చెందిన ఆయకట్టుకు నీళ్లు అందుతున్నాయి. అంతేకాకుండా వైఎస్సార్ జిల్లాలో జీఎన్ఎస్ఎస్ కెనాల్ 0.0 నుండి 162 కిలోమీటర్ల వరకు విస్తరించి ఉంది. ఈ కెనాల్ ద్వారా ఆయా ప్రాంతాల్లో భూగర్భ జలాలు పెంపొందడమే కాకుండా లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా కూడా ఆయా చెరువులకు నీరు అందించి ఆయకట్టుకు నీళ్లందిస్తున్నారు. మొత్తం ఆయకట్టు 92 వేలుగా ఉంది. ఈ ప్రాజెక్టు ద్వారానే వామికొండ, సర్వరాయ సాగర్‌కు నీరందుతుంది. మైలవరం, చిత్రావతి, పైడిపాలెం ఎత్తిపోతల పథకాలకు ఇక్కడి నుంచే నీరు విడుదల చేస్తున్నారు.

ప్రాజెక్టుల సామర్థ్యం ఇలా..

గండికోట ప్రాజెక్టు పూర్తి నీటి సామర్థ్యం 26.85 టీఎంసీలు కాగా, ప్రస్తుతం ప్రాజెక్టులో 24 టీఎంసీలు నీళ్లు ఉన్నాయి. ఈ ప్రాజెక్టుకు శ్రీశైలం, పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి అవుకు రిజర్వాయర్ ద్వారా నీళ్లు చేరతాయి. అవుకు రిజర్వాయర్‌కు, గండికోట ప్రాజెక్టుకు మధ్య 54 కిలోమీటర్ల దూరం ఉంది. గండికోట నుంచి జీఎన్ఎస్ఎస్ కెనాల్‌కు నీరు చేరడమే కాకుండా చిత్రావతి లిఫ్ట్ ఇరిగేషన్‌కు 10 టీఎంసీలు, పైడిపాలెం లిఫ్ట్ ఇరిగేషన్‌కు 6 టీఎంసీలు ఇక్కడి నుంచి విడుదల చేస్తారు. అంతేకాకుండా వామికొండ రిజర్వాయర్‌కు 1.66 టీఎంసీలు, సర్వరాయసాగర్ ప్రాజెక్టుకు 3.06 టీఎంసీలు నీటిని విడుదల చేస్తారు. జీఎన్ఎస్ఎస్ కాలువ ద్వారా 62 వేల ఎకరాలకు ఆయా ప్రాజెక్టుల ద్వారా 35 వేల ఎకరాలకు మొత్తం 97 వేల ఎకరాల ఆయకట్టు ఉంది.

మిగిలిన పనులు త్వరలో పూర్తి



గండికోట ప్రాజెక్టుకు సంబంధించి మిగిలిన పనులను త్వరలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ముంపు గ్రామాల్లో మిగిలిన కుటుంబాలకు పరిహారం అందించేందుకు చర్యలు వేగవంతం చేస్తున్నాం .త్వరలో పెండింగ్ పనులన్నీ పూర్తి చేసి చివరి ఆయకట్టు వరకు నీళ్లిచ్చేందుకు చర్యలు తీసుకుంటాం.

– వి.విజయరామరాజు, జిల్లా కలెక్టర్, వైఎస్సార్ జిల్లా

డిసెంబరు నాటికి లక్ష ఎకరాలకు నీరు



డిసెంబరు నాటికి వివిధ నీటి పథకాల ద్వారా లక్ష ఎకరాల ఆయకట్టుకు పులివెందుల ఏరియాలో నీళ్లు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. చిత్రావతి, పైడిపాలెం, పీబీసీ కెనాల్ ద్వారా ఈ లక్ష ఎకరాల ఆయకట్టుకు నీళ్లించేందుకు పనులను ముమ్మరం చేశాం.

– మల్లికార్జునరెడ్డి, ఎస్ఈ, జీఎన్ఎస్ఎస్, కడప

ప్రశాంతంగా నీట్ అర్హత ప్రవేశ పరీక్ష



కడప ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాల వద్ద వేచి ఉన్న విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్: ఎంబీబీఎస్, బీడీఎస్, ఆయుష్ వైద్య విద్యలో ప్రవేశానికి జాతీయ స్థాయిలో ఆదివారం నిర్వహించిన నీట్ అర్హత పరీక్ష ప్రశాంతంగా జరిగింది. పరీక్ష కోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో జిల్లా యంత్రాంగం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది. విద్యార్థులను ఉదయం 11 గంటల నుంచి పరీక్షా కేంద్రాలలోకి అనుమతించారు. వైఎస్సార్ జిల్లాలో ఏర్పాటు చేసిన నాలుగు పరీక్షా కేంద్రాలకు 2185 మంది విద్యార్థులకు 2144 మంది హాజరుకాగా 41 మంది గైర్హాజరైనట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ కో ఆర్డినేటర్ హరికృష్ణ తెలిపారు. కడప అన్నమాచార్య ఇంజినీరింగ్ పరీక్షా కేంద్రంలో 720 మందికి 705 మంది హాజరుకాగా 15 మంది గైర్హాజరయ్యారు. అలాగే ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాలలో 408 మందికి 401 మంది హాజరయ్యారు. ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో 409 మందికి 400 మంది, ఖాజీపేట మండలం బీరం శ్రీధర్‌రెడ్డి ఇంటర్నేషనల్ స్కూల్లో 648 మందికి 638 మంది హాజరయ్యారు. ఈ పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.20 వరకు జరిగింది.

క్లుప్తంగా

మనస్తాపంతో విద్యార్థిని ఆత్మహత్య


విద్యార్థిని మృతదేహాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్

పెండ్లిమర్రి : మండలంలోని మాచునూరు గ్రామానికి చెందిన పి.అనూష(15) అనే విద్యార్థిని పదవ తరగతి పరీక్షల్లో ఫెయిల్ కావడంతో మనస్తాపానికి గురై ఆదివారం ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం మేరకు... అనూష చౌటపల్లె జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదవ తరగతి చదివి పరీక్షలు రాసింది. శనివారం పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. ఫెయిల్ అవడంతో శనివారం నుంచి దిగులుగా ఉండేది. ఆదివారం ఉదయం తల్లిదండ్రులు కూలీ పనులకు వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో బాత్‌రూమ్‌లోకి వెళ్లి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలికి తల్లి, తండ్రి, అక్క ఉన్నారు. విషయం తెలిసిన వెంటనే సంఘటనా స్థలానికి తహసీల్దార్ ఉదయభాస్కర్ రాజు, ఏఎస్ఐ శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్రారెడ్డిలు మృతదేహాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మణిపూర్‌లో కడప విద్యార్థిని ఆవేదన


జాహ్నవి (ఫైల్)

కడప అర్బన్ : కడపకు చెందిన జాహ్నవి అనే విద్యార్థిని మణిపూర్ రాష్ట్రంలో తీవ్ర భయాందోళనకు గురవుతోంది. అక్కడ జరుగుతున్న హింసాత్మక ఘటనల నేపథ్యంలో.. ఆమె ఉంటున్న హాస్టల్‌లోని విద్యార్థినులు బిక్కుబిక్కుమని గడుపుతున్నారు. దీంతో జాహ్నవి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. కడప మృత్యుంజయకుంటకు చెందిన వెంకటరమణ, సుస్మితకు ఇద్దరు కుమార్తెలు. పెద్దకుమార్తె జాహ్నవి కడపలో ఇంటర్ పూర్తి చేసి నీట్ రాసింది. గతేడాది మణిపూర్‌లో ఎంబీబీఎస్‌లో సీటు వచ్చింది. ఇల్‌పాల్ నగరం నీట్ క్యాంపస్‌లో చదువుతోంది. ఆమెతోపాటు మిగిలిన విద్యార్థినులు కూడా హాస్టల్‌కే పరిమితం కావడంతో సరైన సౌకర్యాలు లేక మరింత ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై జాహ్నవి చెల్లెలు వైష్ణవి విలేకర్లకు సమాచారం అందించారు. తన సోదిరి ఉన్న హాస్టల్ సమీపంలో అర కిలోమీటర్ దూరంలో పేలుడు జరిగినట్లు చెప్పుకొచ్చిందని, ప్రస్తుతం సుర్షితంగా ఉన్నట్లు ఫోన్‌లో తెలియజేసిందన్నారు. అక్కడి సంఘటనలు చూస్తే తమకు చాలా భయంగా ఉందని, ఇక్కడికి రప్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేశారు.

రెడ్‘క్రాస్’ అవుతున్న సేవా సంస్థ

- ఇష్టారాజ్యంగా కొందరు ఉద్యోగులు
- పర్యవేక్షణ లోపమే సంస్థకు శాపం


కడపలోని రెడ్‌క్రాస్ భవనం

కడప కల్చరల్ : ప్రాణాపాయ స్థితిలో రక్తం అందించి ఆదుకునే బాధ్యతగల ఆ సంస్థ పలు విమర్శలకు లోనవుతోంది. పూర్తి స్థాయి పర్యవేక్షణ లేక పార్ట్ టైం సేవలు చాలకపోవడంతోపాటు కొందరు ఉద్యోగుల నిర్లక్ష్యంతో సంస్థ ప్రతిష్ఠ నానాటికీ మసకబారుతోంది. సిబ్బంది సంఖ్యకు తగినంత పనిలేకుండా పోవడంతో ఉద్యోగులు ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తున్నారన్న విమర్శలు కూడా ఉన్నాయి. ఈ నెల 8న ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవం సందర్భంగా డెడ్(రెడ్)లైన్ క్రాస్ అవుతున్న సంస్థ పరిస్థితుల గురించి కథనం.

విమర్శల జడిలో..

అద్భుతమైన పనితీరుతో పలుమార్లు జాతీయ పతకాలు సాధించిన ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ ఇటీవల విమర్శలకు నిలయంగా మారుతోంది. చాలా ఏళ్లుగా పాలక మండలి లేకపోవడం, కనీసం అడ్‌హక్ కమిటీ కూడా లేకపోవడంతో పర్యవేక్షణ లోపించింది. ఇటీవల ప్రత్యేక అధికారిని నియమించినా రెండు జిల్లాల కార్యభారం పూర్తి స్థాయి సేవలు అందించేందుకు అవకాశం లేకుండా పోతోందని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం రెడ్‌క్రాస్ సంస్థలో నలుగురు ల్యాబ్ టెక్నిషియన్లు, ఒకరు చొప్పున వైద్యుడు, నర్సు, కంప్యూటర్ ఆపరేటర్, ఇద్దరు స్వీపర్లు ఉన్నారు. పర్యవేక్షణ లోపం, తగినంత పని లేకపోవడంతో ఉద్యోగులు ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇందుకు కొన్ని ఉదాహరణలు

ఇక్కడా.. అక్కడా..

మూడేళ్ల క్రితం చేరిన ఓ తాత్కాలిక ఉద్యోగి రెడ్‌క్రాస్‌తోపాటు కడప రిమ్స్ ఆస్పత్రిలో కూడా పని చేస్తున్నట్లు ప్రజా సంఘాలు, రెడ్‌క్రాస్ సీనియర్ సభ్యులు ఓ ఉన్నతాధికారికి ఫిర్యాదు చేయగా, ఆ ఉద్యోగి జాగ్రత్తపడి ఫిబ్రవరి నుంచి విధులకు రావడం లేదు. ఒకే సమయానికి రెండు వేర్వేరు ప్రభుత్వ కార్యాలయాల నుంచి జీతం తీసుకుంటున్న విషయం ప్రజాసంఘాల ద్వారా బయటపడింది. సదరు ఉద్యోగి రెడ్‌క్రాస్‌లో పని చేస్తున్న సమయంలో ఎక్కువ భాగం నిద్రపోతున్న వీడియోలను సోషల్ మీడియాలో ట్రోల్ చేశారు. పనివేళల్లో నిద్రపోవడం గురించి రక్తదానం చేసేందుకు వచ్చిన ఓ స్వచ్ఛంద సేవకుడు ప్రశ్నించగా.. ఆమె కులం కార్డు అడ్డుపెట్టి పెద్ద గొడవ చేయగా, ఈ విషయం పై అధికారులకు కూడా తెలియడంతో ఆ ఉద్యోగిని తొలగించారు.

నేను పెద్ద అధికారి క్యాండెట్‌ను

నేను పెద్ద అధికారి క్యాండెట్‌ను. నా జోలికి రావద్దు అంటూ ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తున్న రెడ్‌క్రాస్ కార్యాలయంలోని మరో ఉద్యోగి పట్ల కూడా తీవ్ర విమర్శలు ఉన్నాయి. ఆయన మరో చోట ప్రార్థనాలయంలో కూడా పని చేస్తున్నట్లు తెలుస్తోంది. విధులకు ఆలస్యంగా రావడం, ఆ కొద్ది సమయంలో కూడా ప్రార్థనాలయం పనులే చేస్తుండడం లేదా కార్యాలయంలోనే నిద్రపోవడం, ఇదేంటని ప్రశ్నించిన సహచర సిబ్బందిపై తాను పెద్ద అధికారి క్యాండెట్‌ను, తన జోలికి రావద్దంటూ బెదిరింపులకు దిగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఓ మహిళా ఉద్యోగి పట్ల అనుచితంగా ప్రవర్తించడంతో ఆమె ప్రత్యేక అధికారికి ఫిర్యాదు చేయడంతో ఆ ఉద్యోగిని వివరణ కోరినట్లు తెలుస్తోంది. అధికారి దీనిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారి నుంచి స్పందన లేకపోవడం పట్ల కూడా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆ ఉద్యోగి ఇతర ఉద్యోగుల పట్ల కూడా అలాగే ప్రవర్తిస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. మరిన్ని ఆధునిక యంత్రాలను సమకూర్చుకుని ప్రభుత్వం ఇచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పూర్తి స్థాయిలో సేవలు అందించాల్సిన ఉద్యోగులు సంస్థ ప్రతిష్ఠ మసకబారేలా ప్రవర్తించడం పట్ల పలువురు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఇన్ని ప్రతికూల పరిస్థితుల్లో కూడా అధికారులు రెడ్‌క్రాస్ సేవల్లో లోపం లేకుండా నెట్టుకొస్తుండడం ఊరటనిచ్చే అంశం. పరిస్థితులు రచ్చకెక్కకముందే చక్కబెట్టకపోతే భవిష్యత్తులో సంస్థ ప్రతిష్ఠ మరింత దిగజారే ప్రమాదముందని పలువురు హెచ్చరిస్తున్నారు.

అధికారి వివరణ

ప్రతి కార్యాలయంలోనూ ఇలాంటి సమస్యలు సాధారణం. వీటిని సంయమనంతో సరిదిద్ది కార్యక్రమాలు సజావుగా జరిగేలా చూస్తుంటాం.

– సాయిగ్రేస్, జిల్లా స్టేప్ అధికారి, కడప

కమనీయంగా పుష్పయాగం


లక్ష్మీనరసింహస్వామికి పుష్పయాగం నిర్వహిస్తున్న వేదపండితులు

పెండ్లిమర్రి : మండలంలోని వెయ్యినూతల కోన క్షేత్రంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం కమనీయంగా పుష్పయాగం నిర్వహించారు. ముందుగా స్వామివారికి గణపతి పూజ, ఆకుపూజ వంటి కార్యక్రమాలను వేదపండితులు చేశారు. అనంతరం 12 రకాల పుష్పాలతో తిరుమల తిరుపతి దేవస్థానం విద్యార్థులచే 12 సార్లు లక్ష్మీనరసింహస్వామి, లక్ష్మీదేవి అమ్మవార్లకు నైవేద్యం సమర్పించి పుష్పయాగం చేశారు. గ్రామం నుంచే కాకుండా చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో ఆలయ వంశపారంపర్య ధర్మకర్త పి.నరసింహ హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన ఈత సరదా

- నలుగురు స్నేహితులు వెళ్లి..
- మట్టిగుంతలో ఇద్దరు గల్లంతు
- ఒకరి మృతదేహం లభ్యం
- చీకటి పడటంతో గాలింపునకు బ్రేక్



యశ్వంత్‌గౌడ్ మృతదేహం, ధనుష్ (ఫైల్)

రాజంపేట : ఈత సరదా ఇద్దరి ప్రాణం తీసింది. పట్టణంలోని మన్నూరు, గంగిరెడ్డిపాలెంకు చెందిన నలుగురు స్నేహితులు కార్తీక్, హేమంత్, యశ్వంత్‌గౌడ్, ధనుష్‌లు ఆదివారం సరదాగా ఊటుకూరు చెరువు పరిధిలోని మట్టిగుంత(గాలివారిపల్లె సమీపం)లో ఈత కొట్టేందుకు వెళ్లారు. ఈ క్రమంలో మట్టిగుంతల్లో ప్రమాదవశాత్తు ఇద్దరు గల్లంతయ్యారు. సమాచారం తెలుసుకున్న పట్టణ సీఐ నరసింహారావు ఆదేశంతో ఎస్ఐ వెంకటేశ్వర్లు సంఘటన స్థలానికి చేరుకొని గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. రాజంపేట అగ్నిమాపక శాఖ అధికారి బి.శివశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో హెడ్‌కానిస్టేబుల్ సత్యరాజు, ఫైర్‌మెన్ చక్రవర్తి, వెంకటసుబ్బయ్య, డ్రైవర్ రాజన్నతోపాటు, మరికొందరి యువకులతో గాలింపు చేపట్టారు.

ఒకరి మృతదేహం లభ్యం

మన్నూరులోని శారదాస్కూల్ వెనుకవైపు వీధిలో ఉంటున్న శ్రీనివాసులు కుమారుడు దాసరి యశ్వంత్ కుమార్ గౌడ్ (23) మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజంపేట ఏరియా హాస్పిటల్‌కు తరలించారు.

రాత్రి కావడంతో గాలింపునకు బ్రేక్..

రాత్రి కావడంతో మట్టిగుంతలో గాలింపును నిలిపివేశారు. ఈ మేరకు సీఐ నరసింహారావు విలేకర్లతో మాట్లాడుతూ నలుగురు స్నేహితులు సరదాగా ఈతకు వె వెళ్లారని, వీరంతా చదువుకున్నవారేనన్నారు. కాగా గల్లంతైన వారిలో గంగిరెడ్డిపాలెంకు చెందిన కృష్ణ తనయుడు గంపల ధనుష్ (20) అనే యువకునిగా గుర్తించామన్నారు. సోమవారం ఉదయం మళ్లీ గాలింపు చర్యలు చేపడతామన్నారు.

ఇరు కుటుంబాలకు ఒక్కొక్కరే..

మన్నూరులో నివాసం ఉంటున్న దాసరి శ్రీనివాసులు, ప్రసన్నలక్ష్మీ దంపతులకు ఇద్దరు కొడుకులు ఉన్నారు. ఇందులో ఒకరు ముందుగానే చనిపోయారు. ఉన్న కుమారుడు యశ్వంత్‌గౌడ్ ఈతకు వెళ్లి మృతిచెందారు. తండ్రి చనిపోవడంతో తల్లి ఆలనాపాలన చూసుకుంటోంది. కాగా మరో యువకుడు ధనుష్ తండ్రి కృష్ణ కడప ఆర్టీవో కార్యాలయంలో పని చేస్తున్నారు. ధనుష్ కూడా ఒకడే కుమారుడు కావడం గమనార్హం. ధనుష్ మృదేహం లభ్యం కాలేదు. దీంతో ఈ రెండు కుటుంబాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.


నీటిలో గాలింపు చర్యలు చేపడుతున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు

చెరువులో పడి..


మృతి చెందిన సూరా సంజీవరెడ్డి

బద్వేలు అర్బన్ : స్థానిక మైదుకూరు రోడ్డులోని చెన్నంపల్లె చెరువులో ప్రమాదవశాత్తు పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఆదివారం జరిగిన ఈ సంఘటనకు సంబంధించి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. మున్సిపాలిటీ పరిధిలోని బోవిళ్ళవారిపల్లె గ్రామానికి చెందిన సూరాసంజీవరెడ్డి (58) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఈయనకు భార్య పద్మావతమ్మతోపాటు శివారెడ్డి అనే కుమారుడు ఉన్నారు. అయితే ఆదివారం సాయంత్రం కొంత మంది చెరువులో చేపలు పడుతుండగా అక్కడే ఉండి చూస్తున్న సంజీవరెడ్డి కాలు జారి తూము వద్ద పడిపోవడంతో ఇరుక్కుపోయాడు. చుట్టుపక్కలవారు వచ్చి బయటకు తీసి ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న అర్బన్ పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. మృతుని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పాపాఘ్ని ఇసుక గుంతలో..


మృతి చెందిన హరీష్

వీరపునాయునిపల్లె : మండలంలోని అనిమెల గ్రామానికి చెందిన బట్టల హరీష్(18) ఆదివారం పాపాఘ్ని నదిలో ఈతకు వెళ్లి మృతి చెందాడు. వివరాలలోకి వెళితే.. గత మూడు రోజులుగా జరిగిన బోగాదమ్మ జాతర ముగింపు సందర్భంగా గ్రామస్తులు అమ్మవారికి జంతు బలులు సమర్పించి విందు ఏర్పాటు చేశారు. హరీష్ ఆదివారం తన స్నేహితులతో కలసి పాపాఘ్ని నదిలోకి ఈతకు వెళ్లారు. నదిలో ఇసుకను తీసిన గుంత ఉన్న విషయం తెలియకపోవడంతో ప్రమాదవశాత్తు గుంతలో పడి నీటిలో మునిగిపోయాడు. అది గమనించిన తోటి స్నేహితులు వెంటనే వెలికి తీశారు. హుటాహుటిన వీరపునాయునిపల్లె ఆర్ఎంపీ వద్దకు తీసుకువచ్చారు. అప్పటికే మృతి చెందినట్లు ఆయన తెలిపాడు. తర్వాత వేంపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా.. మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. చేతికి వచ్చిన కొడుకును కోల్పోయామని మృతుని కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజా రమేష్ తెలిపారు.

అంగరంగ వైభవం.. వెల్లాల రథోత్సవం


చెన్నకేశవస్వామి రథం లాగుతున్న భక్తులు


రథోత్సవంలో పాల్గొన్న జనసందోహం

రాజుపాళెం : మండలంలోని వెల్లాల గ్రామంలో శ్రీచెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. సంప్రదాయ బద్ధంగా వేద పండితులు హోమం నిర్వహించి, పూజలు చేసి.. స్వామివారి రథంను ఆలయ చైర్మన్ కానాల విజయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకుడు కానాల బలరామిరెడ్డి, ఈట నరసయ్య, సర్పంచ్ రాధ, ఎస్ఐ రాజగోపాల్, భక్తులు ప్రారంభించారు. ముందుగా తిరునాలకు వచ్చిన కొంతమంది భక్తులు తలనీలాలు సమర్పించి కుందూనదిలో స్నానాలు చేశారు. వివిధ రకాల బొమ్మల అంగళ్లు ఏర్పాటు చేయడంతో ఆలయం వద్ద నూతన శోభ సంతరించుకుంది. పెద్దసంఖ్యలో ఆయా గ్రామాల నుంచి వచ్చిన భక్తులు స్వాములను దర్శించుకున్న అనంతరం పిల్లలతో కలిసి ఆనందంగా తిరిగారు. స్వాముల వారిని ఇన్‌స్పెక్టర్ నరసింహా సింగ్, ఈట నరసయ్య, ఎంపీటీసీ సభ్యుడు శివనాగిరెడ్డి, వైఎస్ఆర్‌సీపీ నాయకులు మధుసుదనరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ రామమోహన్, కానాల రామచంద్రారెడ్డి, ఆయా గ్రామాల్లోని భక్తులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. రథం వద్దకు గ్రామానికి చెందిన కొంత మంది మహిళలు బోనాలు సమర్పించిన అనంతరం రథాన్ని ముందుకు కదిలించారు. అర్చకులు మాధవాచార్యులు, పట్టాభిరామన్, వెంకటా చలపతి, పవన్, శేషాచార్యులు, నవీన్, సురేంద్ర పాల్గొన్నారు.

భక్తులకు మజ్జిగ, పానకం పంపిణీ

తిరునాలకు వచ్చిన భక్తులకు కుమ్మరపల్లె సచివాలయ ఉద్యోగులు, గోట్లూరు, జంగాలపల్లె, నేలటూరు, రాజుపాళెం గ్రామానికి చెందిన కొంత మంది భక్తులు మజ్జిగ, బ్యాళ్లు, పానకం పంపిణీ చేశారు. తిరునాలలో ఎటువంటి సమస్యలు జరగకుండా రాజుపాళెం ఎస్ఐ తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

ఉత్సాహంగా బండలాగుడు పోటీలు

వెల్లాలలో రాష్ట్రస్థాయి సీనియర్స్ వృషభరాజముల బండలాగుడు పోటీలు ఉత్సాహంగా జరిగాయి. మొత్తం ఆరు జతల ఎద్దు పాల్గొన్నాయి. నంద్యాల జిల్లా బేతంచర్లకు చెందిన మేకల వెంకటరాముడు ఎద్దులు 4500 అడుగులు (4 నిమిషాలు ఉండగానే డ్రాప్) లాగి మొదటి స్థానంలో నిలిచాయి. ఆ ఎద్ల యజమానికి ఆలయ చైర్మన్ విజయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకుడు బలరామిరెడ్డి రూ.లక్ష పదివేల నగదును అందించారు. రెండవ స్థానంలో గుంటూరు జిల్లా తాడేపల్లి ఎల్.నిక్షేత్‌రెడ్డి, గద్వాల్ జిల్లా చెర్లగార్లపాడు రామాంజనేయులు ఎద్దులు కలిసి 4411, మూడవ స్థానంలో కృష్ణా జిల్లా కానూరు డి.సుబ్బారావు ఎద్దులు 3498, నాల్గవ స్థానంలో బాపట్ల జిల్లా వేటపాలెం శివకృష్ణ చౌదరి ఎద్దులు 3300, ఐదవ స్థానంలో నంద్యాల జిల్లా జిల్లెల్ల రవి తేజేశ్వర్‌రెడ్డి ఎద్దులు 2705, ఆరవ స్థానంలో వీరపునాయునిపల్లె మండలంలోని కీర్తిపల్లె భరత్‌కుమార్, చెర్లోపల్లె శివరామ్‌రెడ్డి ఎద్దులు కలిసి 2482 అడుగులు లాగి నిలిచాయి. వారికి ఆలయ చైర్మన్, కమిటీ సభ్యులు రూ.75 వేలు, రూ.50 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలను అందించారు. ఎటువంటి గొడవలు జరగకుండా రాజుపాళెం, వన్‌టౌన్ ఎస్ఐలు రాజగోపాల్, మంజునాథ తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. చివరగా రెండు జతల ఎద్దు ఉండగా విపరీతమైన వర్షం పడటంతో పొలాల్లో నీరు నిలిచింది. అయినా పోటీలను ఆపకుండా వర్షం నీటిలోనే 5,6 జతల ఎద్లను కట్టి పూర్తి చేశారు. ఈ పోటీలను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో ఆయా గ్రామ ప్రజలు, మహిళలు, పిల్లలు తరలివచ్చారు.


బండలాగుడు పోటీలు ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు బలరామిరెడ్డి

నెల్లూరు జిల్లాలో బద్వేలు వాసి మృతి


సురేష్ మృతదేహం

బద్వేలు అర్బన్ : శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలోని అనంతసాగరం మండలం ముత్తుకూరు గ్రామ సమీపంలో బద్వేలు పట్టణంలోని పోరుమామిళ్ళ రోడ్డులో గల మెయిన్‌బజార్‌కు చెందిన కుర్రా వెంకటసురేష్ (41) మృతి చెందాడు. ఆయన డ్రైవర్‌గా పని చేస్తూ జీవనం సాగించే వాడు. అతనికి భార్య సునీతతోపాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆదివారం ముత్తుకూరు గ్రామ సమీపంలోని ఉత్తర కాలువలో సురేష్ మృతదేహాన్ని అక్కడి పోలీసులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెందాడా లేక ఆత్మహత్య చేసుకున్నాడా అనే విషయం తెలియాల్సి ఉంది.

ఉరవకొండ ఎద్దుల జయకేతనం

సిద్దవటం : మండలంలోని మాచుపల్లెలో శ్రీ రేణుకాయల్లమాంబ తిరునాల సందర్భంగా ఆదివారం సాయంత్రం నిర్వహించిన వృషభ రాజములచే బండలాగుడు పోటీలు రసవత్తరంగా సాగాయి. ఈ పోటీల్లో మొత్తం 6 జతల ఎద్దు పాల్గొన్నాయి. మొదటి బహుమతి రూ.1,00,116 లను అనంతపురం జిల్లా ఉరవకొండ గ్రామానికి చెందిన మహ్మద్ అలీ ఎద్దు గెలుచుకున్నాయి. రెండవ బహుమతి రూ.70,116లను ప్రకాశం జిల్లా, బేస్తవారిపేట మండలం జే.సీ అగ్రహారం గ్రామానికి చెందిన లక్కు సాయి శివశంకర్ ఎద్దు సాధించాయి. మూడవ బహుమతి రూ. 50,116లను వైఎస్ఆర్ జిల్లా, నరసాపురం మండలానికి చెందిన కె.సాయి ప్రతాప్‌రెడ్డి కైవసం చేసుకున్నాయి. నాల్గవ బహుమతి రూ.30,116లను వైఎస్ఆర్ జిల్లా కాశినాయన మండలానికి చెందిన కామినేని వెంకట సాయి ప్రతాప్‌రెడ్డి ఎద్దు సాధించాయి. ఐదవ బహుమతి రూ. 20, 116లను నంద్యాల జిల్లా పి.ఆర్.పల్లి గ్రామానికి చెందిన చిన్ననాగన్న ఎద్దు గెలుచుకున్నాయి. ఈ బహుమతులను గ్రామ పెద్దలు శ్రీ రేణుకాయల్లమాంబ ఆలయం వద్ద ఎద్ల యజమానులకు అందజేశారు. అంతకు ముందు శ్రీ రేణుకాయల్లమాంబకు స్థానిక మహిళలు బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్లి సమర్పించారు. భక్తులకు కడపకు చెందిన జరుగు రాజశేఖర్‌రెడ్డి అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.